

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, మార్చి 25 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని పలు పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల మంజూరు కోసం, ఇటీవలి సాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డిని కలిసి చర్చించారు. నల్లవాగు, బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించి ఈ ప్రాజెక్ట్ వల్ల రైతులకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే చెప్పగా మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. చర్చలు నారాయణఖేడ్ రైతు సంక్షేమానికి మైలురాయిగా మారనున్నాయి.

## జిల్లాలో ఇంధన కొరత లేదు..తప్పుడు ప్రచారాలను నమొద్దు

### సిపి సాధన రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవంలేదని సీపీ సాధన రష్మీపెరుమాళ్ అన్నారు.బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పెట్రోల్ బంక్‌లలో సరఫరా ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురై ఒకేసారి బంకులకు చేరుకోవడంవల్ల ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు సాధారణ పంపిణీకి అంతరాయం కలుగుతుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి వాహనదారులు ఫుల్ ట్యాంక్ నింపుకోవడానికి లేదా అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వచేసుకోవడానికి ప్రయత్నించొద్దన్నారు. సాధారణ అవసరాల మేరకే ఇంధనాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందన్నారు. ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చౌకధరల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీమాసింగ్

## రేషన్ పంపిణీలో పారదర్శకత పాటించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**కౌడిపల్లి, మార్చి 25, ప్రభాతవార్త:** వచ్చే నెల రేషన్‌కార్డుదారులకు కేంద్ర ప్రకటించిన విధంగా మూడు నెలల రేషన్ పంపిణీ విషయంలో పారదర్శకత, జవాబుదారితనం పాటించాలని చౌక ధరల దుకాణాదార్లకు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతీమాసింగ్ సూచించారు. బుధవారం కలెక్టర్ ప్రతీమాసింగ్ మండల పరిధిలోని కొట్టాల, వెల్మకన్నె గ్రామాల్లో చౌక ధరల దుకాణాలను ఆకస్మీకంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా చౌకధరల దుకాణాలలో సరకుల నిల్వలను పరిశీలించారు. దుకాణాలలో సరకులు తీసుకెళ్లటానికి వచ్చిన రేషన్ కార్డుదారులతో కలెక్టర్ సంభాషించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీమా సింగ్ మాట్లాడుతూ సమర్థవంతంగా పనిచేయాలని, లబ్దిదారులు ఏటువంటి ఆసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులు కల్గిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణి జరగాలని ఆమె ఆదేశించారు. లబ్దిదారులు లేవనెత్తిన ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం, పిడిఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్దిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈమె తోపాటు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, ఎంపిడిఓ శ్రీనివాస్, తహశీల్దార్ క్రిష్ణయ్య తదితరలు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్

### జడ్పి సిఇవో ఎల్లయ్య



మాట్లాడుతున్న జడ్పి సీఈఓ ఎల్లయ్య

**పెద్దశంకరంపేట, మార్చి 25, ప్రభాతవార్త :** వేసవికాలం దృష్ట్యా జిల్లాలో నీటిఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని జడ్పి సీఈఓ ఎల్లయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వచ్చేనెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 10వ తేదీ వరకు నీటి ఎద్దడి నివారణ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలలో మిషన్ భగీరథ నీరు సరిపోతుందా? ఎన్ని బోర్లు ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయి అని వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రైతు వేదికలో నిర్వహిస్తున్న వార్డు మెంబర్ల రెండో విడత శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. గ్రామాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లాలంటే వార్డు సభ్యుల పాత్ర కీలకమన్నారు. వార్డు సభ్యులు పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతికుమార్ సూపరెంటెండెంట్ షకీల్, ఎంపీవో జాకీర్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ కాశిర్నా మాస్టర్ ట్రైనర్లు పాషా, లింగప్ప, సోమేశ్వర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## పనిభారం తగ్గించకపోతే సమ్మె తప్పదు

### -ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కాల్వ చక్రధర్

**గజ్వేల్ టౌన్, మార్చి 25 (ప్రభాతవార్త):** ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిపై పనిభారం తగ్గించకపోతే ఏప్రిల్ లో సమ్మె తప్పదని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కాల్వ చక్రధర్ అన్నారు. బుధవారం గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో సిద్దిపేట జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రెండవ కార్యవర్గ సమావేశం నిర్వహించి వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కాల్వ చక్రధర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రోజువారి విధులలో 60 శాతం సమయం ఆన్ లైన్, ఆఫ్‌లైన్ పనులకే సరిపోతుందని, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది కొరత వల్ల పనిభారం పెరిగి సిబ్బంది శారీరంగా, మానసికంగా కృంగిపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆశా వర్కర్లు సమ్మెలో ఉన్న సమయంలో కుష్టువ్యాధి గుర్తింపు సర్వే కోసం క్షేత్రస్థాయి సిబ్బందిని ఇంటింటికి వెళ్లమనడం సమంజసం కాదని మండిపడ్డారు. కుకునూర్‌పల్లి, దౌల్తాబాద్, అక్కన్నపేట, కొండపాక పిహెచ్‌సిలలో సమస్యలను త్వరలో కలెక్టర్, డిఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వెంటనే ఖాళీగాఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సిబ్బంది రేషనలైజేషన్ చేపట్టాలని, నాడు ప్రకటించిన పిఆర్‌సిని అమలుచేయాలని, డిఏ బకాయిలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించి వారికి రావాల్సిన 10 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన కోర్కెలు తీర్చని పక్షంలో ఏప్రిల్ నెలలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె నోటీసు ఇచ్చి వైద్య సేవలను నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పాండవుల కుమారస్వామి, కాసుల రవీందర్‌రెడ్డి, బి.శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి భూంపల్లి రాజు, గౌరవ అధ్యక్షులు చెరుకు భాస్కర్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాల్వ శోభ, గజ్వేల్ డివిజన్ నాయకులు ఆదిమూలం నారాయణ, దేవసాని వాసుదేవ్, జి.మంగ, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్

# జిల్లాలో పెట్రోల్, డీజిల్,వంట గ్యాస్ కొరత లేదు

### భయాందోళనలతో కొనుగోలు చేయొద్దు.. సిద్దిపేట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (ఎల్‌పిజి) కొరత లేదని భయాందోళనలతో కొనుగోలు చేయొద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి.తనూజ స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి, బుధవారం ఆమె పట్టణంలోని పెట్రోల్ బంక్‌లలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయిల్ రిఫైనరీల నుంచి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం సమక్రమంగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో ప్రజలకు రోజువారీ అవసరాలకు తీర్చడానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొన్ని పెట్రోల్ బంక్‌లలో పొడవైన క్యూలైన్‌లు తాత్కాలిక నో స్టాక్ బోర్డులు తప్పు వదంతులన్నారు. ప్రజలు ఒక్కసారిగా ఎక్కువ ఇంధనం కొనుగోలు చేయడం వల్ల సాధారణం కంటే 3 రేట్లు విక్రయాలు పెరిగాయని చెప్పారు. పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాలు, క్యాన్లలో నిల్వ చేయడం పిఈఎస్ఓ నిబంధనలకు విరుద్ధమని అగ్నిన ప్రమాదాలకు దారి తీస్తాయని తెలిపారు. అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెట్ జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంఎంసిల అడ్వాన్స్ పేమెంట్ మార్పుల వల్ల డీలర్లకు తాత్కాలిక సమస్యలు వచ్చాయని సరఫరాలో లోపం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలియం సంస్థలు పోలీసుశాఖలతో కలిసి పెట్రోల్ బంక్‌లను నిరం తరం పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. ప్రజలు భయాందోళనలతో ఇంధనాన్ని కొనుగోలు చేయొద్దని అవసరం మేరకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారిక ప్రకటనలను నమ్మాలని... సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను నమ్మొద్దన్నారు.



పెట్రోల్‌బంక్ యజమానులతో మాట్లాడుతున్న తనూజ

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**వర్గల్, మార్చి 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచారంగుట్ట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... నాచారంగుట్ట సమీపంలోని ఒక పాత రూమ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు పత్రాలు లభించలేదని తెలిపారు. మృతుడు గతకొంత కాలంగా నాచారం గుట్ట వద్ద బిక్షాటన చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు గౌరారం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## హుస్నాబాద్‌లో పోలీస్ సోదాలు

### డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లు,5 కేజీల 20 సిలిండర్లు స్వాధీనం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** పట్టణంలోని పలు ప్రైవేటు ఎంటర్ ప్రైజెస్ దుకాణాలలో బుధవారం పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఓ దుకాణంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లను అక్రమంగా నిల్వచేసి 5 కేజీల గ్యాస్ సిలిండర్లలో గ్యాస్ నింపుతున్నట్లు గుర్తించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌లతోపాటు 5 కేజీల 20 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు నిలువ చేయడంపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న అక్రమ సిలిండర్లు

## సురభిలో అరుదైన శస్త్ర చికిత్స

**సిద్దిపేట అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మిట్టపల్లి శివారులో గల సురభి మెడికల్ కళాశాల అనుబంధ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో బుధవారం మొదటిసారిగా అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. చిన్నకోడూరు మండలం చెలుకపల్లి గ్రామానికి చెందిన పొట్ల ప్రవీణ్(23) ప్రమాదంలో కుడివైపు గడ్డం పక్క భాగంలో దవడా ఎముక ఫ్రాక్చర్ ఏడుమ వైపు దవడా కీలు కింది భాగంలో ఫ్రాక్చర్ జరిగింది. డెంటల్ సర్జరీ డాక్టర్ స్వాతి హెచ్‌ఓడి, డాక్టర్ సందీప్, ఓఎంఎఫ్ఎస్ బృందం నేతృత్వంలో ఓపెన్ రెడక్షన్ ఇంటర్నల్ ఫిక్సషన్ అండ్ ఇంట్రమాక్సిలరీ ఫిక్సషన్ ద్వారా సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. సర్జరీ జరిగిన తర్వాత పేషెంట్ క్షేమంగా ఉన్నారని డాక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ మొట్ట మొదటి సారిగా ఓపెన్ రెడక్షన్ ఇంటర్నల్ ఫిక్సషన్ అండ్ ఇంట్రమాక్సిలరీ ఫిక్సషన్ ద్వారా సర్జరీ విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో కార్డియాలజీ, యూరాలజీ, అంకాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి విభాగాలకు వైద్య సేవలను ఆరోగ్యశ్రీ కింత ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన దృశ్యం

'వార్త'కు స్పందన

## ఇసుక తరలింపుపై మైనింగ్ అధికారుల దాడులు

### ఇసుక డంప్ సీజ్

చౌటకూర్, మార్చి 25 (ప్రభాతవార్త): మంజీరా నుంచి ఇసుక అక్రమ తరలింపు పై మైనింగ్ అధికారుల మెరుపు దాడులు నిర్వహించారు. వార్త దిన పత్రికలో ప్రచురితమైన ఇసుక దోపిడీ కథనంపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించి ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుదవారం చౌటకూర్, సరాఫ్‌పల్లి శివారులో నిల్వ ఉంచిన ఇసుక డంపింగ్‌లను గుర్తించిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు మెరుపు దాడులు చేసి సీజ్ చేశారు. 15 ట్రాక్టర్ల ఇసుక సీజ్ చేసి ఒక ట్రాక్టర్‌కు రూ. 5 వేలు ఫైన్ వేశారు. గతంలో వెండికోల్ శివారులో ఇసుక డంపింగ్‌లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినప్పటికి మంజీరా వాగు నుంచి ఇసుక దోపిడీ ఆగడం లేదు. మంజీరా నది వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన రమేష్ అరెస్ట్

**అక్కన్నపేట, మార్చి 25, ప్రభాతవార్త :** అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కాశబోయిన రమేష్‌పై కేసు నమోదు చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐ ప్రశాంత్ కథనం ప్రకారం... ఒక వివాదానికి సంబంధించి నిందితుడు రమేష్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడని, ఆ సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది పనిలో నిమగ్నమై ఉండగా, రమేష్ అనవసరంగా జోక్యం చేసుకుని గొడవకు దిగినట్లు తెలిపారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిపోయి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని పేర్కొన్నారు. స్టేషన్ ఆవరణలో సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసే విధంగా ప్రవర్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. చట్టాన్ని గౌరవించకుండా ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయడంతోపాటు అలాంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తికి జైలుశిక్ష

**రాయపోల్, మార్చి 25 (ప్రభాతవార్త):**

రాయపోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ మానస తమ సిబ్బందితో కలిసి రాయపోల్-గజ్వేల్ ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో పరిశీలించగా మద్యం సేవించినట్లు తేలింది. బుధవారం గజ్వేల్ ఏడిఎం కోర్టుతో మెజిస్ట్రేట్ మణివీర్ ఎదుట హాజరుపరచగా అతనికి మూడు రోజుల జైలుశిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని హెచ్చరించారు.



దుండగుల దాడిలో గాయపడ్డ వృద్ధ దంపతులు

## ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులపై దాడి

### బంగారం అపహరణ

**చిన్నశంకరంపేట, మార్చి 25, ప్రభాతవార్త:** మండల పరిధి జంగరాయిలో మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు వృద్ధ దంపతులపై దాడిచేసి బంగారం అపహరించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంజయ్య, సావిత్రిలు వృద్ధ దంపతులు ఇంటి వద్ద ఉంటారు. వారి మనుమడి పెళ్లి సంబంధం విషయమై కుటుంబసభ్యులు భాగ్యనగరానికి వెళ్లారు. వృద్ధ దంపతులు ఒంటరిగా ఉన్న విషయం గమనించిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చోరబడి వారిపై సుత్తితో దాడికి చేశారు. వారు స్పృహ కోల్పోగానే సావిత్రి మెడలోని మూడు తులాల పుస్తెల తాడు, తులంన్నర గుండ్లు, అంజయ్య మెడలోని తులం గొలుసు, అరతులం ఉంగరాన్ని దుండగులు తీసుకొని పరారయ్యారు. వారు తేరుకొని బయటకు వచ్చి కేకలు వేయగా చుట్టుపక్కలవారు వచ్చేలోపే వారు ద్విచక్రవాహనంపై పరారయ్యారు. దాడి చేసిన చేసిన వ్యక్తి ఎరుపు రంగు చొక్కా దరించారని వృద్ధులు తెలిపారు. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్స్‌లో మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ పరిశీలించారు. దుండగులు ద్విచక్రవాహనంపై చిన్నశంకరంపేట వైపునకు వెళ్లినట్లు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించామని నిందితులను త్వరలో పట్టుకుంటామని వారు తెలిపారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా వృద్ధులు ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం గమనించి దాడికి పాల్పడ్డారా, ఇంట్లో పెళ్లిఉంది..అందరూ బయటకు వెళ్లిన సమయం చూసి దాడి చేసి ఉంటారని, ఇది తెలిసిన వారి పనేమోనని గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

## వరకట్న వేధింపులకు మరో యువతి బలి

### ఉరేసుకుని ఆత్మహత్య

**రామాయంపేట, మార్చి 25, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో వరకట్న వేధింపులు మరో యువతి ప్రాణాన్ని బలితీసుకున్న విషాద ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటింబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మాచారి(49) కూతురు వడ్ల మమత(24)ను 2023లో రాయపోలు మండలం రామవరం గ్రామానికి చెందిన వడ్ల నరసింహాచారికి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో లక్ష రూపాయల నగదు, తులంన్నర బంగారం కట్నంగా ఇచ్చినప్పటికీ, అదనపు కట్నంకోసం అల్లుడు నరసింహాచారి, తండ్రి శ్రీనివాస్‌చారి, తల్లి పుష్ప, చెల్లి బాల్‌లక్ష్మిలు కలిసి మమతను వేధించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించి మమతను అత్తింటికి పంపించినా, వేధింపులు ఆగలేదని తెలిపారు. ఇటీవల 15 రోజుల క్రితం అదనపు వరకట్నం ఇస్తామని చెప్పి మమతను అత్తింటికి పంపగా, అదే రోజు ఆమెను తిరిగి పంపించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో మమత తీవ్ర మనస్తాపానికి గురై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. వరకట్న వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రెండు గ్రామాల్లో ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

### -కొందరు పరార్.. నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం

**న్యాల్‌కల్, మార్చి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు రేజింతల్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నవారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... న్యాల్‌కల్‌లోని కిరాణా కొట్టు వెనకాల పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి జూదం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని 52 పేక ముక్కలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

**రేజింతల్‌లో ఇద్దరు...**

మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని ముస్లిం శ్మశానవాటిక వెనకాల ఖాళీస్థలంలో పలువురు జూదం ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ దోమ సుజిత్ సిబ్బందితో దాడి చేయగా పోలీసులను గమనించి కొందరు జూదరులు పారిపోగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు. గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ దోమ సుజిత్ మండల ప్రజలకు సూచించారు.

## రెవెన్యూ అధికారుల దాడులు...

### ఇసుక అక్రమ నిల్వలు జప్తు... 2 ట్రాక్టర్లు పట్టివేత

**పాపన్నపేట, మార్చి 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గాజుల గూడెం, గాంధర్ పల్లి గ్రామాలలో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఇసుక అక్రమ నిల్వలను జప్తు చేసి, రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులకు అప్పగించారు. బుధవారం నమ్మదగిన సమాచారం మేరకు గాజుల గూడెం శివారులోని మంజీరా నది నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ ఆర్ఐ స్వామి వెళ్లి పరిశీలించగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పాపన్న పేట పోలీసులకు అప్పగించారు. అలాగే గాంధర్ పల్లి గ్రామంలో పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు చేశారన్న సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించగా శివారులోని నిర్మానుష్య ప్రాంతాలలో పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు గుర్తించి జప్తు చేసినట్లు ఆర్ఐ స్వామి తెలిపారు. కాగా కొన్ని రోజులుగా మంజీరా పరివాహక ప్రాంతాలలో కొందరు ఇసుక సురులు మంజీరా తీరం నుండి ఇసుకను తోడుతున్నారని. దీంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశాలు ఉంటాయన్నారు. మంజీరా నది తీరం నుండి ఇసుకను తోడిన, రవాణా చేసినవారిపై కటిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గాంధర్‌పల్లిలో ఇసుక నిల్వలు జప్తు చేస్తున్న ఆర్ఐ స్వామి

# విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

**వెల్దుర్తి, మార్చి 25, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం మెదక్‌జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆర్బిఎస్కే హెల్త్ క్యాంప్ పరిశీలనలో జిల్లా కలెక్టర్ పలు అంశాలను వెల్లడించారు. బాలికల ఆరోగ్య రక్షణకు ఆర్బిఎస్కే హెల్త్ క్యాంపుల ద్వారా పటిష్ట చర్యలు చేపట్టడం, వైద్య శిబిరం ఏర్పాటు ద్వారా సైకాలజీ సమస్యలపై బాలికలకు చికిత్సలు అవగాహన, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి, పాఠశాలలో మెనూ అమలపై మాట్లాడారు. జిల్లాలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు ఆమె పరిశీలించారు. మెనూ నిర్వహణ, అల్పాహారం నాణ్యతలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి వారికి అందుతున్న వసతులు, విద్యాబోధన ఇతర సమస్యలపై ఆరాతీశారు. అలాగే పప్పులు, బియ్యం, నిత్యావసర సరుకులను తనిఖీచేసి మెరుగైన ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. వంట గదిలో ఉడికించిన అన్నం, కూరగాయల నాణ్యతను పరిశీలించి రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రత ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆర్బిఎస్కే ఆరోగ్య శిబిరం నిర్వహించి బాలికల గైనకాలజీ సమస్యలకు చికిత్సలు అందించడంతోపాటు బాలికల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తామన్నారు. డిసిహెచ్ఎస్ శివదయాల్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహార లోపం, ఐరన్, విటమి, థైరాయిడ్, కంటి సమస్యలు గుర్తించి చికిత్స అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు 20016 మందికి పరీక్షలు పూర్తి అయినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ విద్యాలయ ఉపాధ్యాయులు హెల్త్ క్యాంప్ డాక్టర్లు తోపాటు తహసిల్దార్ శ్రీనివాస్ ఆర్య నర్సింగ్ యాదవ్ డిటిసిఎస్ సాయికుమార్ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

## రాంపూర్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు



రాంపూర్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

**అల్లాదుర్గం, మార్చి 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాంపూర్‌లో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని భక్తులు బోనాలను సామూహికంగా ఊరేగిస్తూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కుబడులును చెల్లించుకున్నారు. ఆలయంలో ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామం నుంచి అత్తారింటికి వెళ్లిన గ్రామ ఆడపడుచులు తమ కుటుంబసభ్యులతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిచారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**-శ్రీభ్రమరాంబ మల్లికార్జున దేవాలయనిర్మాణానికి రూ.15లక్షల భారీవిరాళం**
**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, మార్చి 25, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మరోమారు తన దైవభక్తిని చాటుకున్నారు. పటాన్‌చెరుమండలం క్యాసారంగ్రామంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం నిర్మాణానికి 15 లక్షల రూపాయల సొంత నిధులు అందించారు. బుధవారం నిర్వహించిన స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, కృష్ణయాదవ్, ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచి



సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచి కున్యానాయక్

**చిలిపిచెడ్, మార్చి 25, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్‌మండలంలోని బద్రియాతండా గ్రామపంచాయతీలో ఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.3లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం ఆ గ్రామ సర్పంచి కున్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో గ్రామంలో రూ.3 లక్షలతో సిసి రోడ్డును ప్రారంభించడం జరిగిందని, గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి బుజ్జిబాయి, ఉపసర్పంచి మోనికగణేష్, వార్డ్‌మెంబర్స్ ఎ.నరేష్, గ్రామపెద్దలు కె.గోపాల్, ఆర్.వర్ష బాల్య, సూర్య, హరియా, శ్రీను, పంచాయతీ కార్యదర్శి మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ నర్సింహారెడ్డికి ఘనసన్మానం



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో 12వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహారెడ్డిని బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందరెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లు మాట్లాడుతూ రైతు సంక్షేమం, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ ప్రజల మెప్పు పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏఎంసి పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంట్లో గృహ ప్రవేశం



పుల్‌కల్‌లో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం దృశ్యం

**పుల్‌కల్, మార్చి 25, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పుల్‌కల్‌లో కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చెందిన కాశ లక్ష్మీ ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి, నాయకులు బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉఉదయ్‌కుమార్, బెస్త ప్రశాంత్, కాశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కరుణాకర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, మార్చి 25, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వర్గల్‌కు చెందిన బిఆర్ఎస్ పార్టీ యువనాయకుడు రంగా కరుణాకర్‌గౌడ్ మృతిచెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కరుణాకర్‌గౌడ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలి

**-డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి**



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీచేయాలని అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, మార్చి 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులుపూర్తయి నెలలుగడుస్తున్నా, పంపిణీచేయడం లేదని ప్రస్తుతం ఇల్లులేని నిరుపేదలు అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 252 ఇళ్లు పూర్తికాగా, మరో 258 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వివిధదశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కరెంటు సరఫరా లేనందున, కరెంటు కోసం ఒక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేస్తే ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పేదలకు పంపిణీచేస్తే సొంతింటికల నెరవేరుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పూర్తయిన 250 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలంటూ లబ్ధిదారులు ధర్నాచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నర్సాపూర్‌లో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని అదేవిధంగా మిగతా ఇళ్ల నిర్మాణపనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

## పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**-హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ షేక్**



పెట్రోల్ బంకును ఆకస్మిక తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఫర్వీన్ షేక్

**హత్నూర, మార్చి 25, ప్రభాతవార్త:**
పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే శాఖాపరమైన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ హెచ్చరించారు బుధవారం సాయంత్రం దౌల్తాబాద్ సమీపంలోని భారత్ పెట్రోల్ పంపును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీజిల్ పెట్రోల్‌కి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ఆమె కోరారు. బంకు యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే శాఖాపరమైన కఠినచర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కనీస నిల్వలు ఎట్టి పరిస్థితిలోనైనా ఉంచాలని తహసీల్దార్ ఫర్వీన్ సూచించారు.

## బాలల సంక్షేమ సమితికి అరుదైన గౌరవం



ప్రశంసాపత్రం అందుకుంటున్న దేశబోయిని నర్సింలు

**గజ్వేల్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త:**
దత్తత ప్రక్రియలో విశేష ప్రతిభ కనబరిచిన సిద్దిపేట జిల్లా బాలల సంక్షేమ సమితికి అరుదైన గౌరవం లభించింది. అర్హులైన బాలల కేసులను సకాలంలో పరిశీలించి, చట్టబద్ధంగా దత్తతకు అర్హులుగా ప్రకటించడంలో రాష్ట్రంలో ముందంజలో నిలిచినందుకు ఈ గుర్తింపు దక్కింది. బాలల సంక్షేమ సమితి మెంబర్ ఇంచార్జ్ దేశబోయిని నర్సింలు, సభ్యులు బాలచంద్రం, అంజమ్మ, మంజులలు ఉన్న సిద్దిపేట బాలలసంక్షేమ సమితి దత్తత ప్రక్రియను వేగవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. వారి కృషి ఫలితంగా అనేకమంది బాలలు సురక్షితమైన, ప్రేమగల శాశ్వత కుటుంబాలను పొందగలిగారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వేర్ ఆర్ ఇండియన్ చిల్డ్రన్స్ సంస్థ సిఈవో మీరామూర్తి బాలల సంక్షేమ సమితి వారికి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిసిపివో రాము, బాలసదనం సూపరింటెండెంట్ వసంత, శిశుగృహ మేనేజర్ రాజు, వేర్ ఆర్ ఇండియన్ చిల్డ్రన్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాలిడేషన్ చట్టం రద్దుచేయాలి

**-ఆర్‌డిఓకు పెన్షనర్ల వినతి**



ఆర్‌డిఓ కార్యాలయంలో వినతి పత్రం అందచేస్తున్న పెన్షనర్లు

**జహీరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:**
వ్యాలిడేషన్‌చట్టం2025ను రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ టిఎస్‌జిఆర్ఈఏ జహీరాబాద్‌శాఖ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్, ప్రధాన కార్యదర్శి పటేల్ రాజేందర్‌రావుల నేతృత్వంలో సంఘంసభ్యులు బుధవారం పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. ప్రధానమంత్రికి, రెవెన్యూ డివిజన్ అధికారి ఏఓ శశిధర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బసవరాజు ఇబ్రహింపూర్, కోశాధికారి బెండి చంద్రశేఖర్, కె.ప్రభాకర్, కె.రాజశేఖర్, ఆనంతయ్య, ధర్మయ్య, రాచయ్య, మహమ్మద్ గౌరీ, యండి అజీమ్, రాందాస్, నరసింహారెడ్డి, కె.నర్సింలు, యండి యాకూబ్, బాగారెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల నిరసన

**-ఆర్డీవోకు వినతిపత్రం**




ఆర్డీవో కు వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

**నర్సాపూర్, మార్చి 25, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలిడేషన్ యాక్ట్‌పై నర్సాపూర్‌లో విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తంచేశారు. అంతేగాక నరసాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గంగారాం, నాయకులు మల్లారెడ్డి, కృష్ణస్వామి, చక్రపాణి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గంగిశెట్టి చందన రవీందర్

**గజ్వేల్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ అధ్యక్షతన కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ పర్యవేక్షణలో 2026-27 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించగా, పట్టణ అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈసమావేశంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ విమల రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలను సభముందు ప్రవేశపెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.40.31కోట్లు ఉండగా, అంచనావ్యయం రూ.39.88 కోట్లుగా రూపొందించారు. గత ఆర్థికసంవత్సరంలో రూ.49.63లక్షల మిగులును ప్రదర్శిస్తూ, ఆశాజనకమైన ఆర్థిక స్థితిగతులను వివరించారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలను పాలకవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ బడ్జెట్ సమావేశానికి ఎక్స్ ఆఫీషో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరై పట్టణ అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీవిద్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం




గురుకుల పాఠశాలకు అర్హత సాధించిన శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు

**పాపన్నపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. పాఠశాల నుండి 15మంది విద్యార్థినీవిద్యార్థులు ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్షలకు హాజరుకాగా, రాష్ట్రప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రిజల్ట్స్ మంగళవారం సాయంత్రం ప్రకటించడంతో శ్రీవిద్య పాఠశాల నుండి మొదటివిడత జాబితాలో 14మంది విద్యార్థినీవిద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు. కాగా పాఠశాల నుండి 15మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రవేశ పరీక్షలో పాల్గొని పరీక్ష వ్రాయగా 14మంది విద్యార్థులు ర్యాంకు సాధించడం కోసం కృషిచేసిన ఉపాధ్యాయులు దుర్గ, సునీత, అనురాధ, షీలా, విలాస్, జ్యోతిరాజ్‌ప్రధాన్‌లు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ రవీందర్‌గుప్తా, కరస్పాండెంట్‌లు నిటలాక్షప్ప, సుమన్‌లు అభినందించారు. ప్రతి ఏటా తెలంగాణ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలలో ఇలాంటి ఫలితాలు పునరావృతం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.

# ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హెచ్చరిక**



ప్రభుత్వ భూముల ఆక్రమణపై కమిషనర్‌కు ఆదేశాలు ఇస్తున్న ఎమ్మెల్యే

**గుమ్మడిదల, మార్చి 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వభూములను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టంచేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్నారం 8వ వార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవరెడ్డి, సర్వే నంబర్ 261కు సంబంధించిన ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ కబ్జాల విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో ఓ పరిశ్రమ ప్రహారీ గోడ నిర్మిస్తూ భూమిని ఆక్రమిస్తున్నప్పటికీ, అధికారులు స్పందించడంలేదని ఆయన ఆరోపించారు.
వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ దశరథకు ఆ అక్రమనిర్మాణాలను తక్షణమే కూల్చివేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రభాకర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లగా, హైకోర్టు స్టేఆర్డర్ ఉందని తెలియజేసి చర్యలు నిలిపి వేశారు. ఈపరిణామంపై కౌన్సిలర్ సంజీవరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ, స్టేఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయో అధికారులను ప్రశ్నించారు. కొందరు ప్రభావశీలులకే అధికారులు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. ఇదే విషయంపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బాధితుడికి పోగొట్టుకున్న మొబైల్ అందజేత




బాధితుడికి మొబైల్ అందజేస్తున్న ఎస్సై నర్సింలు

**చిలిపిచెడ్, మార్చి 25, ప్రభాతవార్త:**
సిఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసిన మొబైల్ ఫోన్‌ను అసలు యజమానికి ఎస్సై నర్సింలు విజయవంతంగా అప్పగించారు. రూ. 15,000 విలువగల ఈ మొబైల్‌ఫోన్ ఇటీవల కోల్పోయినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా, వెంటనే పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాకింగ్ ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలపై ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకుని, నిర్ధారణ అనంతరం బాధితుడికి అందజేశారు. తన మొబైల్ తిరిగి లభించడంతో బాధితుడు ఆనందం వ్యక్తంచేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోయినప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్ ఉద్యోగుల స్వచ్ఛభారత్



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్ ఉద్యోగులు

**జహీరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:**
మహేంద్ర అండ్ మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్ హెడ్ వి.సీతారామయ్య ఆదేశాల మేరకు ట్రాక్టర్ ప్లాంట్ సిబ్బంది బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం, రైల్వే ట్రాక్, స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించిన ఉద్యోగులకు, మహేంద్ర యాజమాన్యానికి రైల్వే స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్ ప్రతినిధులు సునీల్, జలంధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టైర్ల పరిశ్రమ నిలిపివేయాలని తీర్మానించిన పంచాయతీ



టైర్ల పరిశ్రమ వద్దని తీర్మానం చేస్తున్న గ్రామ పంచాయతీ

**చిన్నశంకరంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
మండల పరిధి కామారం గ్రామ శివారు 103 సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న టైర్ల పరిశ్రమ పనులు నిలిపివేయాలని సర్పంచి సుజాత, ఉపసర్పంచి సుధాకర్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో తీర్మానం చేసి, ఆ కాపిని పంచాయతీ కార్యదర్శి సుహాసినికి అందించారు. టైర్ల పరిశ్రమ వల్ల కాలుష్యంతో పాటు రోగాలబారిన పడుతామని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఎట్టిపరిస్థితుల్లో పరిశ్రమను నిర్మించవద్దని తెలిపారు.

## మంజీర విద్యాలయంలో ఘనంగా యుకెజి చిన్నారుల గ్రాడ్యుయేషన్ వేడుక




గ్యాడ్యుయేషన్ పట్టాలతో చిన్నారులు

**రామాయంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
స్థానిక మంజీరా విద్యాలయంలో యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ (పట్టభద్రుల ఉత్సవం) వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎఫ్ఆర్ఓ విద్యాసాగర్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. చిన్నారులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలు, ప్రాజెక్టులు, ఆక్టివిటీలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను రైమ్స్, నృత్యాలు, పాటల రూపంలో వేదికపై ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. కేవలం ఆరుసంవత్సరాల వయస్సులోనే నిర్భయంగా వేదికపై ప్రసంగించడం వారి ప్రతిభను చాటిందని నిర్వాహకులు ప్రశంసించారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల తరపున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి, భావన, ప్రజ్ఞ, శ్రీజ, మోనిక తదితరులు పాల్గొన్నారు.

## డిజిపిని కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



డిజిపి శివధర్‌రెడ్డికి పూలబొకేను అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:**
డిజిపి శివధర్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హైద్రాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందచేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌కు సంబంధించి పలు విషయాలపూ ఎమ్మెల్యే డిజిపికి వివరించారు.

## దీన్‌దయాల్ ఉపాధ్యాయ శిక్షణ అభియాన్

**వెల్దుర్తి, మార్చి 25, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తి లోని ప్రవచనాలు బిజెపి పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ అభియాన్ 2026 మండల కార్యాలకుల బుధవారం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చిష్‌యాదవ్, బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రమేష్‌గౌడ్, జిల్లా జిఎస్ సంఘసాని సురేష్, మండల అధ్యక్షుడు పడగదాసు, నాయకులు నరేందర్‌రెడ్డి, బిజెపినాయకులు వెంకన్న, నర్సింలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

**రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్స్, నీటి సరఫరా పనులకు ప్రాధాన్యం.. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్**



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మీ

**హుస్నాబాద్ టౌన్, మార్చి 25, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మున్సిపాల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు ఆమోదం లభించింది. మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో చర్చించి బడ్జెట్‌ను ఆమోదించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల అభివృద్ధికి మొత్తం రూ.43 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో ప్రధానంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో కార్యాలయ అద్దెకు రూ.6 లక్షలు, ఎస్‌డబ్ల్యూఎమ్ ట్యాక్స్ ద్వారా 2000ల నుండి 2016 సంవత్సరాలకు సంబంధించిన పన్నుల వసూళ్లు, మున్సిపల్ యూజర్ ఛార్జీల వసూళ్లు, రోడ్ల అభివృద్ధి, సైన్స్ లైట్స్ ఏర్పాటు, డ్రైనేజీ మరమ్మతులు, హైద్రాబాద్ వాటర్ సప్లై పనులు, పట్టణంలోని స్ట్రీట్ లైట్ల నిర్వహణ, డిఆర్ సిసి సెంటర్ నిర్వహణ, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మరమ్మతులు, అన్ని కాలనీలలో ప్రజలకు వసతుల కల్పన, ఎండకాలం దృష్ట్యా నీటి సరఫరా మెరుగుదల వంటి అంశాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పలు అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మరవీందర్, మున్సిపల్ విప్ కేశవేని రమేష్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూషవిద్యాసాగర్, బూరుగు లత కిష్టస్వామి, తిరుపతి, బొలిశెట్టి రాజు, పూదరి వరప్రసాద్, వైద్యం కిరణ్‌తో పాటు ఇరత కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.


కొండపాక బాలికల పాఠశాల తోటలో పండిస్తున్న పాలకూర

## విద్యార్థులను ప్రకృతి ప్రేమికులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం**

**కొండపాక, మార్చి, ప్రభాతవార్త :** రసాయన ఎరువలువాడని స్వచ్ఛమైన పోషక విలువలు కలిగిన ఆకుకూరలను మధ్యాహ్న భోజనంలో తీసుకోవడంవల్ల విద్యార్థుల మేధాశక్తి పెరగడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలే కాకుండా ప్రకృతితో మమేకమై ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేల ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎలాంటి రసాయన ఎరువులు కలపని కిచెన్ గార్డెన్‌లో పండించిన పాలకూరతోపాటు పప్పును బుధవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించటం జరిగిందని చెప్పారు. కిచెన్ గార్డెన్‌తో స్వయం సమృద్ధి, మనమే పండిద్దాం మనమే తిందాం అనే నినాదంతో విద్యార్థుల్లో శ్రమశక్తిని స్వయం సమృద్ధి భావాన్ని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను ప్రకృతి ప్రేమికులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్మమన్నారు. ఈ వినూత్న ప్రయాత్నానికి సహకరిస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు : సిఐ


కుమారులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సిఐ లక్ష్మిబాబు

**కొండపాక, మార్చి 25, ప్రభాతవార్త :** తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించి పోషించడం మనందరి బాధ్యత అని త్రీ టౌన్ సిఐ లక్ష్మిబాబు అన్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖమ్మంపల్లికి చెందిన పాముకుంటా నర్సయ్య ఎల్లయ్య దంపతులు తమ ముగ్గురు కుమారులు పట్టించుకోవడం లేదని ఈ నెల 18న ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా ఈ నెల 25న సిఐ వారి ముగ్గురు కుమారులను, కోడళ్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కౌన్సిలింగ్ ఇస్తూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం నైతికంగా తప్పే కాకుండా చట్టపరంగా శిక్షార్హమని వారిని హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం కుమారులు తల్లిదండ్రులను సక్రమంగా చూసుకుంటామని, ప్రతి నెల ఒక్కొక్కరం రూ॥ 15 వందల చొప్పున ఖర్చుకు అందిస్తామని, ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినపుడు అందరం కలిసి వైద్య సహాయం అందిస్తామని వారు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## వాలిడేషన్ యాక్ట్‌ను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

**సిద్దిపేట రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యాక్ట్‌తో పెన్షనర్లు మానసికంగా కృంగిపోతూ ఆందోళన చెందుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాగుల రాజిరెడ్డి, జైన సత్యం అన్నారు. పెన్షనర్లకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా పార్లమెంట్ ఆమోదించిన వాలిడేషన్ యాక్ట్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి బ్లాక్ డేను పాటిస్తూ ఆందోళన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వానికి ప్రజలకు విశేష సేవలను అందించినందులకు పెన్షన్‌ను ఇస్తున్నారని తెలిపారు. ఇక నుంచి నుంచి పెన్షన్‌లో పెరుగుదల లేకుండా వాలిడేషన్ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు స్వర్గం రాజేశం, జానకీరాములు,గోపాల్, రాఘవరెడ్డి, ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్య, రాజిరెడ్డి, మల్లారెడ్డి, జ్ఞానేశ్వర్, తిరుపతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై బిఎల్‌ఓ, జిపిఓలకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మార్చి 25,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షకుల ద్వారా బిఎల్‌ఓలకు సూపర్‌వైజర్లకు, జిపిఓలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ అయేషా రాఫత్, శిక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

**బెజ్జంకి, మార్చి 25,ప్రభాతవార్త:** శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ జాతర వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డైరెక్టర్లు, ఆలయ అర్చకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, బెజుగాం ప్రసాద్, గుబిరే చంద్రం, పొట్లపల్లి ప్రభాకర్, బోనాల మల్లేశం, రావుల నర్సయ్య, పుర్మ నారాయణరెడ్డి, ఐలేని మహేందర్‌రెడ్డి, బుట్ల చంద్ర ప్రకాష్, ఇస్కిల్ల ఐలయ్య, కొండ్ల విద్యప్రకాష్, బోనగిరి శ్రీనివాస్, జంగిటి శంకర్,దొమ్మాట శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


జాతర మహోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

## ఘనంగా గీతామందిరం 32వ వార్షికోత్సవం

**రామాయంపేట, మార్చి 25, ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీకృష్ణ గీతా మందిరం 32వ వార్షకోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు నగర సంకీర్తనతో ప్రారంభమైన వేడుకలు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణతో ముగిసాయి. శ్రీకృష్ణభగవానునికి పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు దోర్బల కుమార శర్మ చేసిన ప్రవచనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం గురువులతో పాటు పలువురికి పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో తొడుపునూరి చంద్రమౌళి, బల్ల రాజయ్య, తోట విఠల్, దేవుని రాములు, చొల్లేటి దయాకర్, గుండు సత్యనారాయణ, జి. గంగాదాస్‌తో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

**మర్కుక్, మార్చి 25 (ప్రభాతవార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త ఇన కొండ చంద్రారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ పురోహితులు చంద్రారెడ్డితోపాటు కుటుంబ సభ్యులను సన్మానించి అభినందించారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ముందుంటూ చంద్రారెడ్డి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణతిరెడ్డి, భవిక్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రావు, కొండ నవీన్, బిఆర్‌ఎస్ పార్టీ మర్కుక్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి లేకపోయినా ప్రజాసేవే లక్ష్యం

**మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్**


రాయపోల్ సర్పంచ్ రాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

**రాయపోల్, మార్చి 25 (ప్రభాతవార్త):** పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవలోనే కొనసాగుతానని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన రాయపోల్‌లో పర్యటించి నూతన సర్పంచ్ మాసంపల్లి రాజును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, ప్రాణం ఉన్నంత వరకు పేదలకు అండగా నిలుస్తానన్నారు. దుబ్బాక నుండి ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం ఇప్పటికీ ప్రజల మధ్యే కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చినహామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజలను నిరాశపరుస్తుందని విమర్శించారు. చెప్పిన పథకాలు అమలుకాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు చింతకింది మంజూరు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## అచ్చాయిపల్లిలో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన

**ములుగు, మార్చి 25 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సిఆర్‌ఐ) ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హంస హోమియోపతి మెడికల్ కళాశాల సహకారంతో మండల పరిధిలోని అచ్చాయిపల్లి గ్రామంలో హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, హంస హోమియోపతి మెడికల్ కళాశాల విద్యార్థులు గ్రామంలోని 136 ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి బాలికల తల్లిదండ్రులకు హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌పివి వైరస్ వల్ల కలిగే సమస్యలు, కారణాలు, దాని ప్రభావాలు, ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎలా ఏర్పడుతుందో వివరించారు. అలాగే ఈ వ్యాధిని నివారించడానికి హెచ్‌పివి టీకా తీసుకోవడం ఎంత ముఖ్యమో గ్రామస్తులకు తెలియజేశారు. తల్లిదండ్రులను తమ పిల్లలకు సమయానికి హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌.ఎస్.శ్రీనిధి, వాలంటీర్లు, హంస హోమియోపతి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

## ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తి బైండోవర్

మిరుదొడ్డి, మార్చి 25, ప్రభాతవార్త : ప్రభుత్వ ఉద్యోగిపై దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని బుధవారం తహశీల్దార్ ఎదుటు ఎస్ఐ సమత బైండోవర్ చేశారు. అంకని బాలరాజు పెద్దచెప్యాల పేరుగల వాట్సాప్ గ్రూపులో వ్యవసాయ అధికారి, ఎఈవోను దూసిస్తూ వ్యక్తిగతంగా దుర్భాషలాడటం బెదిరింపులు చేస్తూ వాయిస్ రికార్డు పంపించారు. ఇలా విధులకు అటంకం కల్గిస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అంకని బాల్‌రాజును ఎస్ఐ సమత తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

**రాయపోల్, మార్చి 25 (ప్రభాతవార్త):** ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయ పోల్ ఎస్ఐ కె.మానస సూచించారు. చిన్న కేసులకు త్వరిత పరిష్కారం లభించే ఈ వేదిక ద్వారా కోర్టు ఖర్చులు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, చెక్ బౌన్స్ కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ లేదా కోర్టును సంప్రదించి ఇరువర్గాలు రాజీకి రావాలని సూచించారు.

## కృష్ణసాగర్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**రాయపోల్, మార్చి 25 (ప్రభాతవార్త):** రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణసాగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుపనులను సర్పంచ్ ఎక్కాల శ్యామల మల్లేశం కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద రూ.10 లక్షల నిధులను మంజూరుచేసిన మెదక్ ఎంపి రఘునందన్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ సిసి రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరమేశ్వర్, ఉపసర్పంచ్ కాళ్ల స్వామి, వార్డు సభ్యులు నరేష్‌గౌడ్, కనకయ్య, యాదగిరి, కుమార్, నర్సింలు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాయపోల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**రాయపోల్, మార్చి 25 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మసీదు నుంచి తెలంగాణతల్లి విగ్రహం వరకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ డ్రైనేజీ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలకు శుభ్రమైన వాతావరణం కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనులను దశల వారీగా చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హనుమంతు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

# అంకెల గారడి, బోగస్ బడ్జెట్

**రాష్ట్ర బడ్జెట్‌పై మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఫైర్**


బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన బిఆర్‌ఎస్ నాయకులు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 25, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోందని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్‌ను అంకెల గారడి, బోగస్ బడ్జెట్‌గా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంకెలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని, వాస్తవాలకు దూరంగాఉన్న అవాస్తవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో సరైన నిధుల కేటాయింపులు లేవని, కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా వంటి కీలక పథకాల అమలుపై స్పష్టతలేదని, బడ్జెట్ ప్రసంగంలో వాటిపై సరైన ప్రకటన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాల్లోనే భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. పెన్షనర్లు, సింగరేణి కార్మికులు, మహిళలు, సంక్షేమ రంగాలకు ఈ బడ్జెట్ ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కానీ వాటిలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. 420 హామీలు ఇచ్చి ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రాష్ట్రానికి దిక్సూచిగా ఉండాల్సిన వ్యక్తి అయినప్పటికీ ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ రాష్ట్ర పరువును బజారుకుడిస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్రం దివాలా తీసిందని చెబుతూ జాతీయస్థాయిలో రాష్ట్ర పరువును దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి తీరు కారణంగా రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోయిందని, రైతులు మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా బస్తాల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ముఖ్యమంత్రికి పరిపాలనపై అవగాహన లేదని, ప్రజలు, రైతులు, యువత, విద్యార్థులకు భరోసా ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి ఇప్పటికీ కనిపిస్తోందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు తప్ప మరో అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో బడుగు బలహీనవర్గాలు, విద్యారంగాన్ని తీవ్రంగా విస్మరించారని ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, నియోజవర్గ అధికార ప్రతినిధులు చంద్రయ్య, మల్లిఖార్జున్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్‌లు ఎడబోయిన తిరుపతిరెడ్డి, లింగాల సాయన్న, సీనియర్ నాయకులు బోజు రవి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, వాల నవీన్‌రావు, కామిరెడ్డి క్రాంతిరెడ్డి, గోనెల మధుకర్, కూతాటి విజయ్‌భాస్కర్, మేకల వికాస్‌యాదవ్, బూర వెంకన్న, గద్దల రమేష్, కందుకూరి సతీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

## రంగంపేటలో తైబజార్ వేలంపాట

**కొల్చారం మార్చి 25 ప్రభాతవార్త :** మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో 2026-27 మార్చి సంవత్సరం నాటికి సంబంధించి తైబజార్ వేలంపాటను నిర్వహించారు. గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్ చిట్కుల సురేష్ అధ్యక్షతన పంచాయతీకార్యదర్శి రాజు ఆధ్వర్యంలో తైబజార్ వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పదిమంది పాల్గొన్నారు. వేలంపాటలో రెండులక్షల ముఫైరెండు వేలు రూపాయలకు కొమ్ముల లక్ష్మీనరసింహులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిబంధనల మేరకే గుత్తేదార్ తై బజారు వసూలు చేయాలని,నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శంకర్, నర్సింలు, పాటదారులు పాల్గొన్నారు.

## త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి : సర్పంచ్

**బెజ్జంకి, మార్చి 25,ప్రభాతవార్త :** గూడు లేని ప్రతి పేదకు ప్రభుత్వం ఇందిర్మ ఇళ్ల మంజూరు చేయడం జరుగుతుందని సర్పంచ్ ముక్కిస కవిత అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఇందిర్మ ఇళ్ల పథకం కింద వచ్చిన ఇందిరమ్మ ఇల్లుకు లబ్ధిదారుడు బోనగిరి లక్ష్మి బుధవారం స్లాబ్ పోసే పనులను సర్పంచ్ ముక్కిస కవిత ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో లక్ష్మీపూర్‌కు 22 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయ్యాన్నారు. మంజూరు వచ్చిన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి అనుష, ఉప సర్పంచ్ గంగాధర హరీష్ పాల్గొన్నారు.

## ఘనంగా బాలమేళా

**సిద్దిపేట అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలోగల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం బాల మేళా ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ పాఠశాలల్లో పిల్లలు నేర్చుకున్న విద్యతోపాటు ఆటలు, పాటలు, నృత్యాలను ప్రదర్శించేలా ప్రోత్సహించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ ఆటలు, నృత్యాలతో రోల్‌ప్లేతో చూపరులను అకట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు చదువుతో పాటు వివిధ కళలు నేర్చుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఒ శారదా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.సి.సుదర్శన్, సరిత, సిఆర్‌పి రజిత, అంగన్‌వాడీ టీచర్స్ శ్రీలత, సునిత, ఎఎన్‌ఎం రూప, ఆశా కార్యకర్తలు బాబాయి, ఆయాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలో...**

**సిద్దిపేట అర్బన్, మార్చి 25,ప్రభాతవార్త :** ప్లాస్టిక్ వినియోగంతో అనేక ఆనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలనకు స్టీలుపాత్రలు వినియోగించాలని కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్ అన్నారు. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 37వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలమేళా నిర్వహించారు. బాలమేళాలో అంగన్‌వాడీ చిన్నారులు నేర్చుకున్న ఆటపాటలు పాడుతూ నృత్యాలుచేసి సరదాగా గడిపారు. అనంతరం కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్ ఆధ్వర్యంలో చిన్నారులకు స్టీల్ టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అధికారులు, టీచర్స్, ఆయాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం: సర్పంచ్


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

**కొల్చారం, మార్చి 25: ప్రభాతవార్త :** అప్పాజీపల్లి గ్రామ అభివృద్ధే లక్ష్యమని సర్పంచ్ నాయిని వెంకట్‌గౌడ్(గజిని) పేర్కొన్నారు.బుధవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.6,50,000 నిధులతో అంతర్గత సీసీరోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఈ పనులకు సహకరించిన నర్సాపూర్ నియోజకవర్గ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రతి గల్లీకి సీసీ రోడ్లు నిర్మించడం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేయడం ద్వారా అప్పాజీపల్లిని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెలం నర్సింలు, వార్డ్ సభ్యులు సదాల నర్సింలు, మానేపల్లి సావిత్రి, కదూరి సుశీల, రామాంజం, పంచాయతీ కార్యదర్శి పణింద్ర కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, దాది కృష్ణ, బాగాయల యాదయ్య, మానేపల్లి అశోక్‌రెడ్డి, యాదగిరి, సదాల శ్రీకాంత్, రాజబోయిన వీను, చింతల శివ, గ్రామ అధ్యక్షుడు ఫాహాద్ పాషా పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, మార్చి 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ బుధవారం సమ్మక్క-సారాలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. హరికృష్ణకు ఆలయ అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మల దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, రాజబహదూర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కొంగ సాంబమూర్తి, ఎర్ర మహేందర్, అనిల్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

**మర్కుక్, మార్చి 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎంపిపి పాండుగౌడ్, సర్పంచ్ దుబాసి భవాని బాలకిషన్, బిఆర్‌ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్, ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న బోయిని ప్రమీలకు రూ.26,500, శ్రీగిరిపల్లి లక్ష్మికి రూ.17వేలు, పెద్దబోయిని మమతకు రూ.17వేల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, వార్డు సభ్యులు మ్యాకల శ్రీనివాస్, రాజు, పాల్గొన్నారు.

## ఐకెపి వివోఏలకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలి

**మిరుదొడ్డి, మార్చి 25, ప్రభాతవార్త :** ఐకెపి వివోఎల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని వివోఏ జిల్లా కార్యదర్శి యమునా అన్నారు. బుధవారం ఛలో హైదారాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి వివోఏలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వివోఏలకు కాంగ్రెస్ సర్కార్ రూ.20 వేల వేతనం ఇస్తామని హామీఇచ్చి నేటికీ అమలుచేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే వివోఏలకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లో ఆన్‌లైన్ పనులను అదనంగా చెబుతూ వివోఏలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని తెలిపారు.కార్యక్రమంలో వివోఏలు వెంకటలక్ష్మీ, మంగమ్మ, లావణ, నసీరుద్దీన్, భూపాల్, మహేష్, సిద్ద రాములు, లక్ష్మీ, పుష్ప. భాగ్య, సంధ్య, జ్యోతి, పావని, శైలజ తదితరులు పాల్గొన్నారు.


ఛలో హైదారాబాద్ తరలివెళ్తున్న వివోఏలు

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## -మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దారం శంకర్



రేషన్‌కార్డు అందజేస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ దారం శంకర్

**నారాయణఖేడ్, మార్చి 25, ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటకు చెందిన కుమ్మరి సాయిలు కుటుంబ సభ్యులు కమ్మరి దుర్గయ్య ఆహార భద్రత కార్డుకు దరఖాస్తుచేసుకున్నారు. సాంకేతిక లోపం వల్ల కొన్నిరోజులు పెండింగ్‌లోపడింది. దరఖాస్తుదారులు ఈ విషయమై మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ దృష్టికి తీసుకెళ్లగా వైస్ చైర్మన్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారులతో మాట్లాడించి రేషన్‌కార్డు మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా మంజూరైన కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ఆహారభద్రత కార్డులను ఇప్పటివరకు 5.61 లక్షల కొత్త రేషన్‌కార్డులను జారీచేయడం జరిగిందన్నారు. ఉన్న రేషన్ కార్డులలో 17 లక్షలకు పైగా వ్యక్తులను కార్డులలో ఆడ్‌చేయడం జరిగిందన్నారు. నిరుపేద ప్రజలు కడుపునిండా అన్నం తినాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడమే కాకుండా సన్నబియ్యాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. అందువల్ల అర్హులైన ప్రజలందరూ ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఇప్పల బాలయ్య, కుమ్మరి హనుమంతు, సాయిలు, ఎలుగొడ్ల మహేష్, కుమ్మరి సాయిగోపాల్, కృష్ణ, చాకలి వీరేశం, రవి, గోపాల్‌సాగర్, గొల్లవిటల్, మల్లయ్య, సాయి, తదితరులు ఉన్నారు.

## నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

### -భక్తుల కానుకలు 6లక్షల 31వేల 832 రూపాయలు



బోరంచ నల్లపోచమ్మ ఆలయహుండీని లెక్కిస్తున్న దృశ్యం

**మనూర్, మార్చి 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బోరంచ గ్రామంలోని శ్రీనల్లపోచమ్మ ఆలయహుండీని బుధవారం లెక్కించారు. ఆలయానికి ఆయాప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలోభాగంగా హుండీలో సమర్పించుకున్న కానుకలు 6లక్షల31వేల832 రూపాయలు అని ఆలయకమిటీ ఛైర్మన్ మల్లయ్య పేర్కొన్నారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయహుండీని లెక్కించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ శివానంద్, ఆలయకమిటీ ఛైర్మన్ మల్లయ్య, ఎఎస్ఐ గోవింద్, ఆలయ అర్చకులు, సిబ్బంది శ్రీకాంత్‌స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేస్తున్న అధికారిణి లలితాదేవి

**మనూర్, మార్చి 25, ప్రభాతవార్త:**
గర్భిణీస్త్రీలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలితాదేవి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని బోరంచలో అంగన్‌వాడీ టీచర్లతో లలితాదేవి ప్రత్యేకంగా సమావేశం అయి టీచర్లకు పలుసూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, టీచర్లు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ సుజాత, సూపర్‌వైజర్ జమున, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

### -పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి



శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, మార్చి 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కరస్‌గుత్తిలో బుధవారం మహారాష్ట్ర యోధుడు శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ఉనికిని, విదేశీ దండయాత్రల నుంచి ప్రజలను విముక్తిచేసిన మహానేత శివాజీ మహారాజ్ అన్నారు. శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు నిలయాలు సరస్వతి శిశుమందిరాలు




వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
సంస్కృతీసంప్రదాయాలతో కూడిన విద్యను శ్రీసరస్వతి శిశుమందిరాలు అందిస్తున్నాయని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో సంస్కారంతోపాటు విలువలతోకూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు జంగం రాఘవులు, క్రాంతికుమార్, పున్నయ్య, బుగుడాల సాయిలు, గాండ్ల సర్వేశ్వర్, ప్రకాశం, ప్రధాన ఆచార్యులు లక్ష్మీనారాయణ, జైహింద్‌రెడ్డి, శ్రీనివాస్‌ఆచార్య బృందం, పోషకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాలిడేషన్ యాక్ట్‌కు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

**సదాశివపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పెన్షనర్‌దారులకు మార్చి 25, 2025 దుర్దినమని సదాశివపేట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని పింఛన్‌దారులకు 25 మార్చి 2025 దుర్దినమని ఈ వ్యాలిడేషన్‌కు వ్యతిరేకంగా మనరాష్ట్ర సంఘం పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. భారత పార్లమెంట్ లోక్‌సభలో వ్యాలిడేషన్ యాక్ట్‌ను ఆమోదించిన ఆచట్టప్రకారం 01.01.2026 కంటే పదవీవిరమణ చేసినవారిని 01.01.2026 తరువాత రిటైర్ అయినవారిని వేరువేరుగా విభజించి రాబోయే వేతన సవరణసంఘం సిఫారసులవలన నష్టం జరుగుతుందని, పెన్షనర్లను వీడదీయొద్దని ఉద్దేశంతోనే రాష్ట్ర సంఘం పిలుపుమేరకు అధికారులకు వినతి పత్రం అందచేయడం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి తుక్కుదేదాస్, కోశాధికారి చీల విశ్వనాథమ్, జిల్లా సంయుక్త కార్యదర్శి టి.శ్రీనివాస్‌యాదవ్, అసోసియేట్ అధ్యక్షులు బుచ్చప్ప, ఉపాధ్యక్షులు సత్యనారాయణ చిప్పి, నిర్మల, సంయుక్తకార్యదర్శి భీమ్రావు, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లేశం, ప్రచారకార్యదర్శి వారాధి కాశీనాథ్, కౌన్సిల్ సభ్యులు చిగుర్తి అంబయ్య, అంబటి విశ్వనాథం, పట్లూరి వీరప్ప, ముఖ్య సలహాదారుడు బోడపల్లి శంకరప్ప, చింత జనార్ధన్, పెంటయ్య పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

**సదాశివపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలని మూడు నెలల కూలీ డబ్బులను తక్షణమే ఇవ్వాలని రెండుసార్లు ఫోటోతీసేవిధానాన్ని రద్దుచేయాలని సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు సదాశివపేట మండలంలోని వివిధగ్రామాల నుండి సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం సదాశివపేట ఏరియా కమిటీ సభ్యులు ఎస్.రమేష్‌గౌడ్, ఎండి ఖయ్యూం, ఉపాధికూలీలు బుచ్చయ్య, శివయ్య, సంజీవులు, మల్లమ్మ, జ్యోతి, సావిత్రి, లక్ష్మి, వినోద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళాసంఘం భవననిర్మాణానికి భూమిపూజ



మహిళాసంఘం భవనానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**నార్సింగి, మార్చి 25, ప్రభాతవార్త:**
నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి పెద్ద తండాలో నూతన మహిళా సమాఖ్య భవనానికి బుధవారం సర్పంచి దూషిని, ఉపసర్పంచి మోహన్ నాయక్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఉపసర్పంచి మాట్లాడుతూ మహిళాసంఘాల బలోపేతానికి ప్రభుత్వం భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మహిళాసంఘాల సభ్యులు తమసమావేశాలను, ఇతర కార్యకలాపాలను సొంతభవనంలో నిర్వహించుకోవడం వల్ల వారి ఆర్థిక, సామాజిక సాధికారత మరింత మెరుగుపడుతుంది. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. కావున ఈభవనం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని ఆశాభావం వ్యక్తంచేశారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి, మహిళలు ఆత్మగౌరవంతో బ్రతకడానికి ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నవీన్, జమ్లి, మన్ని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా శ్రీసీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

**పటాన్‌చెరు, మార్చి 25, ప్రభాతవార్త:**
ఆధ్యాత్మిక చింతనతోపాటు సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధుముదిరాజ్ సొంతనిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో నిర్మించిన శ్రీహనుమ సమేత సీతారామ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం కన్నులపండువగా ముగిసింది. గత నాలుగురోజులుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా, బుధవారం తెల్లవారుజాము నుండే వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూర్తులకు ప్రాణప్రతిష్ఠ గావించి, నేత్రోన్మీలనము నిర్వహించారు. ఈసందర్భంగా నీలం మధుముదిరాజ్ తీసుకున్న ఈ చొరవను కాలనీవాసులు కొనియాడుతున్నారు. అనంతరం భక్తులకు రక్షాధారణ, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామనామ స్మరణతో చిట్కుల్ పురవీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, భక్తులు గ్రామ పెద్దలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం రద్దుచేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

**పెద్దశంకరంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వ్యాలిడేషన్ చట్టం 2025ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మండల రిటైర్డు ఉద్యోగులు తహసీల్దార్ ప్రభుదాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.నర్సింలు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు ఇబ్బందిగా మారిన వ్యాలిడేషన్ చట్టంను తక్షణమే రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులసంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రాచారి, మోహన్, వెంకటరమణ, నారాయణ, జగన్నాథ్‌రావు, విజయ్కుమార్, సుమంగళ, సంగమేశ్వర్, పురుషోత్తం, బాలకిషన్, పద్మారావు తదితరులున్నారు.

## కబ్జాదారుల నుండి శంభునికుంటను కాపాడాలి...

**అమీన్‌పూర్, మార్చి 25, 2026**
సంగారెడ్డిజిల్లా అమీన్పూర్‌మండలంలోని బీరంగూడలో ఉన్న శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడి ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరణ చేయాలని సిపిఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఎం ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలనుండి చెరువులను, కోట్లరూపాయల విలువైన ప్రభుత్వభూములను కాపాడాలని అనేక సందర్భాలలో రెవెన్యూ అధికారులకు, మున్సిపల్ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు, కలెక్టర్ దృష్టికితీసుకెళ్లడం జరిగిందన్నారు. నిరాహార దీక్షలు, ధర్నాలు అనేకపోరాటాలు చేయడం జరిగిందన్నారు. బీరంగూడ నడిబొడ్డులో ఉన్నటువంటి శంభునికుంట, రెవెన్యూ అధికారుల రికార్డులప్రకారం సర్వేనెంబర్ 765లో22ఎకరాల12గుంటల భూమి ఉంది అన్నారు. రాజకీయ నాయకులు రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారుల అండదండలతో పెద్ద ఎత్తున కబ్జాలు జరిగాయని ఆయన తెలిపారు. హైడ్రా అధికారులు జోక్యం చేసుకొని కబ్జాదారులనుండి కుంటనుకాపాడి కాలువలను పునర్నిర్మాణంచేసి ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## రామాయంపేటను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

### -మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.కె అహ్మద్

**రామాయంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో డిలిమిటేషన్ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో రామాయంపేటను మళ్లీ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటుచేయాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ ఎస్‌కె.అహ్మద్ డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేటకు గొప్పచరిత్ర ఉందని, గతంలో ముఖ్యనాయకులు ఎదిగిన ఈప్రాంతానికి తిరిగి ఆ హోదా రావాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు, యువజన సంఘాలు, అన్నివర్గాల ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలిసి కట్టుగా ముందుకువచ్చి రామాయంపేట నియోజకవర్గ సాధనకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ పోరాటంలో ముందుంటుందని, ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. ఐక్యతతో కృషిచేస్తే లక్ష్యం సాధ్యమేనని, జై రామాయంపేట నినాదంతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## దోమడుగు అభివృద్ధికి సంపూర్ణ సహకారం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**గుమ్మడిదల, మార్చి 25, ప్రభాతవార్త:**
నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు వార్డులో హెట్రోడ్రగ్స్ పరిశ్రమ సౌజన్యంతో రూ.79లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, రక్షిత మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ సంధ్యారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, హెట్రోడ్రగ్స్ ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దోమడుగు కౌన్సిలర్ రాజశేఖర్, వివిధవార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవిద్యార్థులకు అండగా సద్ది రాంరెడ్డి ట్రస్ట్

**గుమ్మడిదల, మార్చి 25, ప్రభాతవార్త:**
విద్య ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువును మధ్యలోనే మానేస్తున్న దుస్థితిని దృష్టిలో ఉంచుకుని సద్ది రాంరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ముందుకొచ్చింది. మాజీ ఉపసర్పంచి కీ.శే.సద్ది రాంరెడ్డి సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఏర్పాటుచేసిన ఈ ట్రస్ట్ ద్వారా సమాజానికి సేవచేయాలని నిర్ణయించుకున్నామని ట్రస్ట్ జనరల్ సెక్రటరీ సద్ది రిషిక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సద్ది రాంరెడ్డి 12వ వర్ధంతిని పురస్కరించుకుని డ్రీమ్ బిగ్ - వర్క్ హార్డ్ నినాదంతో బొంతపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీచేశారు. ఈకార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాదివేయాలనే సంకల్పాన్ని ట్రస్ట్ ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ట్రస్ట్ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, సామాజిక కార్యకర్త సద్ది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రసాద్, గ్రామపెద్దలు, యువకులు, సద్ది రాంరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ విగ్రహాన్ని హైద్రాబాద్‌లో ఏర్పాటుచేయాలి

### -గిరిజన నాయకులు సురేష్‌నాయక్




గిరిజన నాయకులు సురేష్‌నాయక్‌ను అరెస్టు చేసిన పోలీసులు

**కంది, మార్చి 25, ప్రభాతవార్త:**
సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని హైద్రాబాద్‌లో ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం నాయకులు సురేష్‌నాయక్ డిమాండ్‌చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం శాసనసభ ముట్టడికి వెళ్లనున్న సురేష్‌నాయక్‌ను సంగారెడ్డి రూరల్ పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుఠాణాకు తరలించారు. ఈసందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని శాంతియుతంగా శాసనసభను ముట్టడించేందుకు వెళుతున్న తమను అరెస్టుచేయడం సరైందికాదన్నారు. ప్రజలకు తమ నిరసన తెలుపుకునే హక్కును కాలరాయడం ప్రభుత్వానికి తగదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తేల్చిచెప్పారు. గిరిజన బంజారానాయకుల ఆత్మగౌరవానికి భంగం కల్గిస్తే చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సేవాలాల్ మందిరాన్ని నిర్మించాల్సిందే

### -శాసన సభ ముట్టడికి వెళ్లి అరెస్టయిన గిరిజనులు



అసెంబ్లీ వద్ద గిరిజనులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**కంగ్టి, మార్చి 25, ప్రభాతవార్త:**
హైద్రాబాద్ నగరంలోని నడిబొడ్డున గిరిజన ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని నిర్మించాలని డిమాండ్‌చేస్తూ బంజారాభేరి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు దేవసోత్ మోహన్‌రాథోడ్, తెలంగాణ గిరిజన ఉపసర్పంచులుల, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాథోడ్, సురేష్‌నాయక్‌లు అన్నారు. గిరిజన సంఘం పిలుపు మేరకు శాసన సభ ముట్టడికివెళ్లినవారిని అసెంబ్లీవద్ద, మరికొందరు గిరిజనులను మార్గమధ్యలో (సంగారెడ్డి, అల్లాదుర్గం ప్రాంతాల్లో) పోలీసులు అరెస్టుచేసి పోలీసుఠాణాలకు తరలించారు. ఈసందర్భంగా గిరిజన సంఘాల నాయకులు రాథోడ్, సురేష్‌నాయక్, దేవసోత్ మోహన్‌రాథోడ్‌లు మాట్లాడుతూ సేవాలాల్ మందిరాన్ని బంజారా హిల్స్‌లో 20 ఎకరాల విశాలస్థలంలో నిర్మించాలని డిమాండ్‌చేశారు. తమను అరెస్టుచేసి ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. మారుమూల ప్రాంతాల్లో గుడి నిర్మాణంతో ప్రయోజనం లేదని, హైద్రాబాద్‌లో కట్టడమే బాగుంటుందన్నారు. గతంలో సేవాలాల్ మహారాజ్ బంజారాహిల్స్‌లో నివాసం ఉన్నారని గుర్తుచేశారు. హైద్రాబాద్‌లో సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మించే వరకు తమ ఉద్యమాలు ఆగవని రాథోడ్ సురేష్‌నాయక్, దేవసోత్ మోహన్ రాథోడ్‌లు హెచ్చరించడం జరిగింది.

## గిరిజన నాయకులు ముందస్తు అరెస్టు




గిరిజన నాయకులను అరెస్టు చేసిన అల్లాదుర్గం పోలీసులు

**అల్లాదుర్గం, మార్చి 25, ప్రభాతవార్త:**
గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్‌మహారాజ్ విగ్రహాన్ని హైద్రాబాద్‌లోనే ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తూ చలో హైద్రాబాద్ కార్యక్రమానికి తరలివెళుతున్న గిరిజన నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుఠాణాకు తరలించారు. లంబాడిసంఘాలు, గిరిజనసంక్షేమ సంఘం, విద్యార్థిసంఘాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో పోలీసులు మండలం నుంచి గిరిజనులు శాసనసభ ముట్టడికి తరలిపోకుండా ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా బంజారా భేరి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు దేవసోత్ మోహన్‌రాథోడ్, వి.గోపాల్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ప్రాంతంలో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కితే ఆందోళనను ఉధృతం చేయాల్సివస్తుందని హెచ్చరించారు.

## వికాలాంగుడికి సర్పంచి ఆర్థిక సహాయం

**చౌటకూరు, మార్చి 25, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరుకు చెందిన వికలాంగుడు కొల్కూరి బాబుకు గ్రామ సర్పంచి పార్కల రాంరెడ్డి బుధవారం ఆర్థిక సహాయం అందచేశారు. కొన్నిరోజుల క్రితం బాబు భార్య మల్లేశ్వరి గుండెపోటుతో మృతిచెందింది. ఆర్థిక సమస్యలతో బాబు అవస్థలు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సర్పంచి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కలాలి రామాగౌడ్, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, వార్డుసభ్యులు గోరే మియా, జైపాల్‌రెడ్డి, దమ్మీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సాధనకు నేడు కీలక సమావేశం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నియోజకవర్గ సాధన సమితి సభ్యులు

**రామాయంపేట, మార్చి 25, ప్రభాతవార్త:**
రామాయంపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు మెదక్‌రోడ్డులోని ప్రగతిరిసార్ట్‌లో ముఖ్యసమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సాధన సమితి సభ్యులు తెలిపారు. ఈమేరకు నియోజవకవర్గ పునరుద్ధరణ గురించి స్థానిక తహసీల్దార్ రజని కుమారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామాయంపేటను మళ్లీ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి రామాయంపేట పట్టణంతో పాటు రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన మేధావులు, అన్ని రాజకీయపార్టీల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీసర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారన్నారు. అలాగే బిసి, కాంగ్రెస్, టిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ, ఎంఆర్పిఎస్ తదితర పార్టీల నాయకులు, బిసి సంఘాల ప్రతినిధులు, పత్రికా విలేకరులు, డాక్టర్లు, ఇంజనీర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, విద్యార్థి సంఘాలు, విశ్వహిందూపరిషత్ తదితరసంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. రామాయంపేట ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, కోల్పోయిన నియోజకవర్గాన్ని తిరిగి సాధించేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని పేర్కొన్నారు. అందరూ ఐక్యంగా హాజరై, ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సాధన సమితి విజ్ఞప్తి చేసింది.